

సమస్యలకు చెక్

భూ భారతి చట్టంతో సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ విజయ్‌కుమార్ అన్నారు. 8లో▸



నిధులు లేక ఇబ్బంది

జీపీలకు నిధులు రాక ఇబ్బందిగా ఉందని మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. 9లో▸



నెలాఖరు వరకు రేషన్

రేషన్‌కార్డు లబ్ధిదారులకు ఈ నెల చివరి వరకు సన్న బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 9లో▸

న్యూస్‌రీల్

కక్ష సాధింపు చర్యే..

రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, ప్రముఖ న్యాయవాది శుభప్రద్‌పటేల్



తాండూరు: సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాస్‌రావును అరెస్ట్ చేయడం పత్రిక స్వేచ్ఛకు విఘాతం కలిగించడమేనని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, ప్రముఖ న్యాయవాది శుభప్రద్‌పటేల్ అన్నారు. ప్రజల్లో నెలకొన్న ప్రభుత్వ వ్యతిరేకతను లోకానికి చూపిస్తున్న వారిపై కక్షగట్టడం తీవ్రమైన చర్య అని పేర్కొన్నారు. కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఏపీ ప్రభుత్వం ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. జర్నలిజంలో యాభై ఏళ్ల సుదీర్ఘ అనుభవమున్న వ్యక్తిని అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఎవరూ హర్షించబోరన్నారు. ఏపీతో పాటు తెలంగాణలో సైతం ఇలాంటి వ్యవహారాలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులను అరెస్టు చేయడం, పత్రిక కార్యాలయాలపై దాడులకు దిగడం ఏపీ ప్రభుత్వ నిర్బంధ పాలన పరాకాష్టకు చేరుకుందన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

కొడంగల్ రూరల్: తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా జి.శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అశోక్, ఉపాధ్యక్షులుగా ఏ చంద్రశేఖర్, నిఖిల్ మనోహ, మహిళా అధ్యక్షురాలిగా శ్రీవాణి, మహిళా ఉపాధ్యక్షులిగా బానోత్ కృప, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కరుణాకర్, సంయుక్త కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్, సెక్రటరీగా శ్రీకాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మధుసూదన్‌రెడ్డి, ట్రెజరర్‌గా నగేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అంతకుముందు సీపీఎస్ రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఫ్యామిలీ పెన్షన్‌లోని లోపాలు, ప్రభుత్వం చెల్లించే మ్యాచింగ్ గ్రాంట్స్ జమ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి సీపీఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు.

ఉపకరణాల కోసం దివ్యాంగుల ఎంపిక



దివ్యాంగులతో మాట్లాడుతున్న జయసుధ

కొడంగల్: దివ్యాంగులకు ఉచితంగా సహాయక ఉప కరణాలు అందిస్తామని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జయసుధ అన్నారు. సోమవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సహాయ ఉపకరణాల పంపిణీ కోసం దివ్యాంగుల ఎంపిక ప్రక్రియను నిర్వహించారు. మహిళా శిశు, దివ్యాంగుల మరియు వయో వృద్ధుల సంక్షేమ శాఖ, సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వ శాఖ, భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో పరికరాలు అందజేయనున్నట్లు తెలిపారు. కొడంగల్ నియోజకవర్గంలోని దివ్యాంగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రతి ఒక్క దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, బీపీఎల్ రేషన్ కార్డు, యూడీఐడీ కార్డు, ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. భారత ప్రభుత్వ ఏడీఐపీ పథకం కింద గుర్తించబడిన అర్హత కలిగిన దివ్యాంగులకు మాత్రమే ఉచితంగా సహాయక ఉపకరణాలు అయిన బ్యాటరీ వీల్ చైర్స్, మోటార్ ట్రై సైకిళ్లు, ఇయరింగ్ తదితర సహాయక పరికరాలను ఇస్తామన్నారు. కనీసం 40 శాతం వైకల్యం కలిగి ఉండాలన్నారు. కొడంగల్‌లో సోమవారం నిర్వహించిన శిబిరంలో 154 మంది దివ్యాంగులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీడీపీఓ రజిత, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని సోమవారం కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రికి కావాల్సిన సదుపాయాలపై ప్రతిపాదనలు సమర్పించాలని అధికారుల సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈఈ ఉమేష్ కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో రికార్డు



తుది దశకు కొనుగోళ్లు

- 2024 యాసంగి సీజన్‌లో 53వేల మెట్రిక్ టన్నుల సేకరణ
- 2024 ఖరీఫ్‌లో 45వేల మెట్రిక్ టన్నులు..
- ప్రస్తుత సీజన్‌లో 80వేల మెట్రిక్ టన్నులు
- మరో ఐదు వేల మెట్రిక్ టన్నులు వచ్చే అవకాశం
- రైతులకు చెల్లించిన మొత్తం రూ.140 కోట్లు

వికారాబాద్: జిల్లాలో ఈ సారి రికార్డు స్థాయిలో ధాన్యం సేకరించారు. ఇంకా కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగుతుండగానే పెట్టుకున్న లక్ష్యానికి చేరువయ్యారు. ముందస్తు వర్షాలను సైతం అధిగమించి భారీగా కొనుగోళ్లు చేశారు. గతేడాది ఖరీఫ్, యాసంగి సీజన్లతో పోలిస్తే ఈ సీజన్‌లో ఇప్పటికే 40 శాతం అధికంగా సేకరించారు. ప్రస్తుతం కొనుగోళ్ల ప్రక్రియ ముగింపు దశకు చేరుకోగా 80వేల మెట్రిక్ టన్నులు సేకరించారు. వీటికి సంబంధించి రూ.140 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. మరో వారం పది రోజుల్లో ధాన్యం సేకరణ ప్రక్రియ ముగియనుంది. అయితే ఆలస్యంగా నాట్లు వేసిన కొన్ని మండలాల్లో వరి కోతలు చేపడుతున్నారు. రైతుల నుంచి పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని అప్పటిదాకా కేంద్రాలను తెరచి ఉంచాలని జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

లక్ష్యం లక్ష మెట్రిక్ టన్నులు

గత రెండు మూడు సీజన్లతో పోలిస్తే ఈ సీజన్‌లో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టారు. 2024 యాసంగి సీజన్‌లో 93వేల ఎకరాల్లో వరి సాగు చేయగా రెండు లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చింది. ప్రైవేటుకు పోనూ 1.1లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కేవలం 53వేల మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించారు. 2024 ఖరీఫ్ సీజన్‌లో రికార్డు స్థాయిలో 1.30 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. 2.8లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. 1,05,000 మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 45 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో 92 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా రెండు లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ప్రైవేటుకు పోను 90 వేల నుంచి లక్ష మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం పది కొనుగోలు కేంద్రాలు మూసి వేశారు. మిగిలిన సెంటర్లను మరో పదిహేను రోజుల్లో మూసి వేయనున్నట్లు తెలిసింది. అయితే ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. మరో ఐదు వేల మెట్రిక్ టన్నులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

“ రూ.140 కోట్లు జమ

జిల్లాలో 128 కొనుగోలు కేంద్రాల ద్వారా సన్న రకం, దొడ్డు రకం వడ్లను సేకరించాం. క్వింటాలుకు రూ. 2,320 చొప్పున మద్దతు ధర చెల్లించాం. సన్న రకం వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తున్నాం. రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి రూ.180 కోట్లు చెల్లించాల్సి ఉండగా అన్నదాతల ఖాతాల్లో రూ.140 జమ చేశాం. మరో రూ.40 కోట్లు చెల్లించాల్సి ఉంది.

– లింగ్యానాయక్, అడిషనల్ కలెక్టర్

ప్రకృతిని కాపాడాలి



పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

- వ్యవసాయ శాస్త్రవేత్తలు సుధారాణి, శేఖర్

దోమ: రైతులు సేంద్రియ సాగు చేసి ప్రకృతిని కాపాడాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ సుధారాణి, డాక్టర్ కె.శేఖర్ సూచించారు. సోమవారం దోమ మండల కేంద్రంతో పాటు దాదాపూర్ రైతు వేదికల్లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ సాగుపై దృష్టి సారించాలన్నారు. శాస్త్రవేత్తలు సిఫారసు చేసిన మోతాదులోనే ఎరువులు వాడాలని సూచించారు. రసాయన ఎరువులతో భూ సారం దెబ్బతిని పంటలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. పురుగు మందుల కారణంగా పంటలకు మేలు చేసే వానపాములు, మిత్ర పురుగులు చనిపోతాయని చెప్పారు. అనంతరం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త టి.లక్ష్మణ్ మాట్లాడుతూ.. రైతులు అధిక మొత్తంలో యూరియా వాడుతున్నారని దాన్ని తగ్గించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యూరియా అధికంగా వాడటం వలన నేల ఆరోగ్యం దెబ్బతిని దీర్ఘకాలిక ఉత్పాదకత తగ్గుతుందని తెలిపారు. మేలైన దిగుబడులకు పంట మార్పిడి తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. విత్తనాలు, ఎరువులు కొనే సమయంలో రశీదులు తప్పకుండా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మోత్కూరు పీఏసీఎస్ చైర్మన్ యాదవ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ కుమార్ రెడ్డి, పరిగి ఏడీఏ లక్ష్మి కుమారి, మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్ రావు, వ్యవసాయ విస్తరణ అధికారులు చెన్నయ్య, బాబ్యానాయక్, సంతోష్, శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



డీఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దళిత, ప్రజాసంఘాల నాయకులు

డీఎస్పీ కార్యాలయం ముట్టడి

- దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్
- అగ్రకుల పెత్తందారులకు కొమ్ముకాస్తున్న డీఎస్పీపై చర్యలు తీసుకోవాలి
- సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన దళిత, ప్రజాసంఘాలు

తాండూరు టౌన్: దళితులపై దాడి చేసిన అగ్రకులాల వారిని వెంటనే అరెస్టు చేయాలని పలువురు దళిత, ప్రజాసంఘాల నాయకులు, బాధితులు సోమవారం తాండూరు డీఎస్పీ కార్యాలయాన్ని ముట్టడించారు. దళితులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గత నెల 18న బెల్కటూర్ గ్రామానికి చెందిన వినయ్ అనే దళితుని పెళ్లి బారాత్‌లో అగ్రకులానికి చెందిన వారు కార్యక్రమాన్ని అడ్డుకోవడమే కాకుండా, వారిపై దాడి చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం విధితమే. నిందితులను అరెస్టు చేయకపోవడం సమంజసం కాదన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గిన డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అగ్రకులాల వారికి వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. వెంటనే వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీసులు ఆందోళన చేస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కే శ్రీనివాస్‌తో సహా పలువురిని అదుపులోకి తీసుకున్నారు.

సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు

దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో డీఎస్పీ కార్యాలయ ముట్టడికి ఇచ్చిన పిలుపును భగ్నం చేసేందుకు పోలీసులు నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్, చంద్రయ్య, రత్నం తదితరులు అన్నారు. డీఎస్పీపై చర్యలు తీసుకోవాలంటూ తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఉన్నతాధికారులు గ్రామాన్ని సందర్శించి, దాడి చేసిన వారిని అరెస్టు చేసి, దళితులకు న్యాయం చేయాలని వారు కోరారు.

జిల్లా అధికారులపై కలెక్టర్ ఫైర్

- బాధ్యతలు గాలికొదిలేశారంటూ క్లాస్
- నిర్లక్ష్యం వీడాలని హితవు
- ప్రజావాణి కార్యక్రమంలో నించోబెట్టి మండిపాటు



ప్రజావాణిలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్: ఆయా శాఖల హెచ్‌ఓడీలకు కలెక్టర్ ప్రతీక్ జైన్ క్లాస్ తీసుకున్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వీడాలని వార్నింగ్ ఇచ్చారు. ఇందుకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం వేదికయ్యింది. ముందుగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు, ప్రజల నుంచి అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్డీఓ వాసు చంద్రతో కలిసి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూతో పాటు ఆయా సమస్యలకు సంబంధించి 84 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మిగతా వాటిని సంబంధిత శాఖలకు రెఫర్ చేశారు. అనంతరం ఆయా శాఖల జిల్లా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు హాజరు కాకుండా కింది స్థాయి ఉద్యోగులను పంపడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ఎందుకు రాలేదో సంజాయిషీ ఇవ్వాలని నోటీసులు ఇచ్చాం. అయినా మండల ప్రత్యేక అధికారులు నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

ప్రశ్నల వర్షం

ముందుగా మైనింగ్ ఏడీని నించోబెట్టి మీరు ఏ మండలానికి ప్రత్యేక అధికారిగా ఉన్నారని ప్రశ్నించారు. పెద్దేముల్ మండలానికి అని ఆయన సమాధనం ఇచ్చారు. ఇప్పటి వరకు ఎన్నిసార్లు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు? అక్కడి సమస్యలను గుర్తించారా? ఎన్ని ఇందిరమ్మ ఇళ్లను సందర్శించారు..? సన్న బియ్యం పంపిణీ ఎలా ఉంది..? అని వరుస ప్రశ్నలు వేశారు. ఇందులో ఏ దానికి కూడా ఆయన నుంచి సమాధానం రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సివిల్ సప్లయ్ డీఎం, మరి కొంతమంది అధికారులను వారికి కేటాయించిన మండలాలపై ప్రశ్నలు వేశారు. వారు కూడా నీళ్లు నమిలారు. దీంతో మరింత ఆగ్రహానికి గురైన ఆయన కనీసం వారంలో రెండు సార్లు మీమీ మండలాల పర్యటించాలి కదా అన్ని అన్నారు. ఇకపై విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

స్కూల్ యూనిఫాంలు సిద్ధం

అనంతగిరి: పాఠశాలల పునఃప్రారంభంలోపు విద్యార్థులకు యూనిఫాంలు అందజేస్తామని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. సోమవారం నగరం నుంచి మంత్రి సీతక్క అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో విద్యా సంవత్సరం ప్రారంభంపై సమీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాకు 65 వేల యూనిఫాంల అవసరం ఉందని ఇప్పటికే 61 వేల యూనిఫాంలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్డీఓ శ్రీనివాస్, డీపీఓ జయసుధ, డీఈఓ రేణుకాదేవి, వయోజన విద్యాధికారి తదితరులు పాల్గొన్నారు.

వీరంగం సృష్టించిన ఆవు



ఆవును అదుపు చేస్తున్న యువకులు, ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి తదితరులు

- అదుపు చేసి గోశాలకు తరలింపు

తాండూరు టౌన్: ఎదురుపడిన వారిని కుమ్మేస్తూ ఓ ఆవు వీరంగం సృష్టించింది. ఆవు దాడిలో పలు వురు స్వల్పంగా గాయపడగా, మరికొందరు తప్పించుకున్నారు. ఈ ఘటన సోమవారం తాండూరు పట్టణంలో చోటుచేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తికి చెందిన ఓ ఆవు పట్టణంలో తిరుగుతూ కనపడిన వారిపై దాడి చేస్తూ హంగామా సృష్టించింది. అదృష్టవశాత్తు ఎవరికీ పెద్ద గాయాలు తగలకపోవడంతో జనాలు ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, గోస రక్షణ సమితి, గోశాలకు చెందిన పలువురు యువకుల సహాయంతో ఆవును అదుపు చేసి పట్టణంలోని గోశాలకు తరలించారు. అయితే ఆవును రెండు రోజుల క్రితం కుక్కలు కరిచినట్లు తెలిసింది. ప్రస్తుతం ఆవు గోశాలలో సేద తీరుతోంది.

14న లోక్ అదాలత్



మాట్లాడుతున్న జడ్జి చంద్రకిశోర్

అనంతగిరి: ఈ నెల 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్ అన్నారు. సోమవారం లోక్ అదాలత్ నిర్వహణపై బార్ అసోసియేషన్‌లో ఏర్పాటు చేసిన న్యాయవాదుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజీ పడేందుకు సిద్ధంగా ఉన్న అభ్యర్థులకు నేటి నుంచి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి వెంకటేశ్వర్లు, జూనియర్ సివిల్ జడ్జి శాంతలత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బస్వరాజు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

- ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

పరిగి: వన మహోత్సవంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం పరిగి పట్టణంలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నాటిన మొక్కలను కాపాడుకోవడం మన బాధ్యత అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నేతలు సిద్ధాంతి పార్థసారథి, సర్వర్, కృష్ణయ్య, హనుమంతు ముదిరాజ్ పాల్గొన్నారు.



మొక్క నాటి నీరు పోస్తున్న కాంగ్రెస్ నాయకులు



తాండూరు నుంచి కర్ణాటక సరిహద్దు వరకు అందుబాటులో ఉన్న రైల్వే లైన్

లైన్ క్లియర్..!

తాండూరు - చించోళి కొత్త రైల్వే లైన్ దిశగా అడుగులు

- జంక్షన్‌గా మారనున్న తాండూరు
- సిమెంట్ కర్మాగారాల ట్రాక్‌లతో అనుసంధానం చేస్తే వ్యయం తగ్గే అవకాశం

తాండూరు: తాండూరు నుంచి కర్ణాటక రాష్ట్రంలోని చించోళి వరకు కొత్త రైల్వే లైన్ ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నట్లు తెలిసింది. తాండూరు- చించోళి మధ్య 30 కిలోమీటర్ల దూరం(రోడ్డు మార్గంగా వెళితే) ఉంటుంది. కొత్తగా ఏర్పాటు చేసే రైలు మార్గం ద్వారా మరో 5కిలో మీటర్ల దూరం పెరిగే అవకాశం ఉన్నట్లు తెలిసింది. తాండూరు నుంచి కర్ణాటక సరిహద్దులోని సిమెంట్ పరిశ్రమ వరకు రైల్వే ట్రాక్ అందుబాటులో ఉంది. సిమెంట్ పరిశ్రమ నుంచి చించోళి పట్టణం కేవలం 12కిలో మీటర్ల దూరం ఉంటుంది. చించోళి, తాండూరు ప్రజలు దశాబ్దాలుగా రైల్వేలైన్ వేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ రెండు ప్రాంతాల ప్రజల ఆకాంక్షను దృష్టి పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుందని కల్బుర్గి (గుల్బర్గ) మాజీ ఎంపీ ఉమేష్ జాదవ్ తెలిపారు.

అనుసంధానం చేస్తే..

తెలంగాణ.. కర్ణాటక అంతర్రాష్ట్ర సరిహద్దు జిల్లాల మధ్య నాపరాతి నిక్షేపాలు ఉన్నాయి. తాండూరు నియోజకవర్గం, కర్ణాటకలోని కల్బుర్గి జిల్లాలో నాపరాతి నిక్షేపాలు పుష్కలంగా ఉన్నాయి. ఇరు జిల్లాల పరిధిలో 10 సిమెంట్ పరిశ్రమలు ఉన్నాయి. ప్రతి కర్మాగారానికి రైల్వే లైన్ అందుబాటులో ఉంది. తాండూరు రైల్వే స్టేషన్ నుంచి చించోళి ప్రాంతంలోని కల్లూర్ గ్రామంలో ఉన్న చిట్టినాడ్ సిమెంట్ పరిశ్రమ వరకు రైల్వే ట్రాక్ ఉంది. ఐదేళ్ల క్రితం ఇది అందుబాటులోకి వచ్చింది. ఈ మార్గాన్ని చించోళి వరకు పొడగించనున్నారు. చిట్టినాడ్ సిమెంట్ కర్మాగారం నుంచి చించోళి వరకు 12 కిలోమీటర్ల దూరం ఉంది. ఇక్కడి నుంచి అనుసంధానం చేస్తే సగం లైన్ వేయడం తగ్గుతుంది. ఇదిలా ఉండగా పెద్దేముల్ మండలం – కర్ణాటకలోని కుంచారం మీదుగా చించోళికి రైల్వే లైన్ కోసం గతంలో సర్వే చేశారు. రెండు రోజుల క్రితం మాజీ ఎంపీ ఉమేష్ జాదవ్ రైల్వే శాఖ మంత్రిని కలిసి తాండూరు - చించోళి కొత్త రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని కోరాగా అనుమతులు మంజూరైనట్లు మంత్రి చెప్పారని ఆయన తెలిపారు.

“ కొత్త లైన్‌తో ఎంతో మేలు



తాండూరు- చించోళి రైల్వే లైన్ కోసం మాజీ ఎంపీ ఉమేష్ జాదవ్ ఎంతో కృషి చేశారు. దశాబ్ద కాలంగా రెండు ప్రాంతాల ప్రజలు ఇందు కోసం వినతులు ఇస్తున్నారు. ఇప్పటికే సర్వే కూడా పూర్తి చేశారు. త్వరలో పనులను ప్రారంభిస్తామని కేంద్ర రైల్వే శాఖ మంత్రి హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు పూర్తియితే తాండూరు, చించోళి ప్రాంతాల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతోంది.

– డాక్టర్. సంపత్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు

క్లుప్తంగా

బావిలో దూకి స్వీపర్ ఆత్మహత్య



అంత్యక్రియలకు ఆర్థికసాయం అందజేస్తున్న ఎస్‌ఐ విమల

బంట్వారం: బంట్వారం పోలీస్ స్టేషన్‌లో స్వీపర్‌గా పని చేసే కె.బాలమ్మ (44) ఒంటరి జీవితం భరించలేక వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. అంత్యక్రియల నిమిత్తం మృతురాలి కుటుంబీకులకు ఎస్‌ఐ విమల రూ.15వేలు అందజేశారు. సోదరుడు మల్లయ్య ఫిర్యాదు మేరకు సోమవారం పోస్టు మార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డుపైనే యాచకురాలి ప్రసవం

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో ఆస్పత్రి ఆవరణలోకి రాక ముందే రోడ్డుపై ఓ యాచకురాలు ప్రసవించింది. స్థానికంగా ఉండే మౌనిక సోమవారం తెల్లవారుజామున 4గంటల సమయంలో పురిటి నొప్పులతో రైల్వేస్టేషన్ చౌరస్తా నుంచి వికారాబాద్ ఆస్పత్రికి వస్తుండగా ఎక్కువయ్యాయి. వైద్యశాల ఎదుట ఉన్న హోటల్ సమీపంలో పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. వెంటనే ఈ విషయాన్ని హోటల్ నిర్వాహకుడు ఆస్పత్రిలో సమాచారం అందించాడు. దీంతో ఆస్పత్రివర్గాలు వచ్చి తల్లీశిశువును తీసుకెళ్లి వైద్యం అందించారు. మహిళకు రక్తస్రావం ఎక్కువ కావడంతో రెండు బాటిళ్ల రక్తం కూడా ఎక్కించారు. ఆమెను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంచంద్రయ్య తెలిపారు.

రండి.. ప్రభుత్వ కళాశాలలో చేరండి

దౌల్తాబాద్: రండి.. ప్రభుత్వ కళాశాలలో చేరండి అని అధ్యాపకులు కోరుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ఎన్నో ఉద్యమాల ఫలితంగా మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు అయింది. అయినా గత విద్యాసంవత్సరం దాటిపోవడం, అధ్యాపకుల నియామకం లేకపోవడంతో కళాశాలలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపలేదు. ఇదే విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ప్రస్తుత ఏడాదికి అధ్యాపకులను నియమించారు. విద్యార్థుల ప్రవేశాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు.

మంజూరైన పోస్టులు

కళాశాలలో 12 అధ్యాపక పోస్టులు, ప్రిన్సిపాల్, ఒకటి ఫిజికల్ డైరెక్టర్, ఒక లైబ్రేరియన్ కలిపి మొత్తం 15 పోస్టులు మంజూరు అయ్యాయని అధికారులు తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులు ఉన్నాయని, పదో తరగతి పూర్తయిన విద్యార్థులు కళాశాలలో చేరాలని అధ్యాపకులు ప్రచారం చేస్తున్నారు. ఆసక్తి గల విద్యార్థులు అడ్మిషన్లు తీసుకోవాలని సూచించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



శంకరయ్య (ఫైల్)

చేవెళ్ల: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. మండలంలోని మీర్జాగూడ గ్రామానికి చెందిన జేగ్గల శంకరయ్య(40) భార్య పద్మతో కలిసి శంషాబాద్ సమీపంలో మూడు నెలలుగా తోటకూలీలుగా పని చేస్తూ జీవిస్తున్నారు. ఆదివారం సాయంత్రం స్వగ్రామమైన మీర్జాగూడకు వచ్చారు. రాత్రి ఇంట్లో లైట్లు రావటం లేదని శంకరయ్య మీటర్ వద్ద చెక్ చేసే ప్రయత్నం చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి కిందపడిపోయాడు. వెంటనే భార్య స్థానికులతో కలిసి చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరిశీలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతదేహానికి సోమవారం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టు మార్టం నిర్వహించి కుటుంసభ్యులకు అప్పగించారు. భార్య పద్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భూ భారతితో సమస్యలకు చెక్

జోరుగా కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు



కొడంగల్: మాట్లాడుతున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

కొడంగల్: భూ భారతి చట్టంతో సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఇందనూర్‌లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. భూ భారతి చట్టం గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గతంలో రైతులు ఎదుర్కొన్న సమస్యలకు ఇప్పుడు పరిష్కారం లభిస్తుందన్నారు. రైతులు ఇచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. భవిష్యత్తులో భూ వివాదాలకు తావులేకుండా ప్రభుత్వం కొత్త చట్టాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

13 దరఖాస్తులు

తాండూరు రూరల్: రైతులు భూ సమస్యలు పరిష్కరించుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ లలిత అన్నారు. సోమవారం తాండూరు మండలం ఉద్దండపూర్‌లోనిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భూ భారతిచట్టంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చెన్‌గేస్‌పూర్, ఉద్దండపూర్ గ్రామాల్లో కలిపి మొత్తం 13 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ గోపీ, మాజీ సర్పంచ్ కేశవ్‌రావు ఉన్నారు.

మర్పల్లిలో..

మర్పల్లి: భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పురుషోత్తం చెప్పారు. సోమవారం కోట్‌మర్పల్లి, మర్పల్లి గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఏళ్లుగా పరిష్కారం కానీ భూములకు చక్కని మార్గం దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ బ్లాక్–2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు చుట్టంలాంటిది

దుద్యాల్: భూ భారతి చట్టం రైతులకు చుట్టం లాంటిదని తహసీల్దార్ కిషన్ అన్నారు. సోమవారం కుదురుమల్ల గ్రామంలో ఏర్పాటు చేసిన రైతు సదస్సు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి సంబంధించి 25 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. మంగళవారం చిలుములమైల్వార్ గ్రామంలో రైతు సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ వీరేశ్ బాబు, ఆర్‌ఐ నవీన్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూ భారతితో మేలు

మోమిన్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు వినియోగించుకోవాలని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి సూచించారు. సోమవారం మండల పరిధిలోని చీమల్‌దరి, చక్రంపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ భారతి చట్టంతో రైతులకు మేలు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, డిప్యూటీ తహసీల్దార్ సురేష్ కుమార్, ఆర్‌ఐలు గోవర్ధన్, సరిత, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

560 ఎకరాల సమస్య

నవాబుపేట: మండలంలోని నారెగూడలో 560 ఎకరాల భూ సమస్యను పరిష్కరించాలని ఆ గ్రామస్తులు రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఆలూరు దొర సీతారామరావుకు చెందిన సర్వే నంబర్ 1 నుంచి 130 వరకు సుమారు 560 ఎకరాల భూమిని 100 ఏళ్ల కింద గ్రామస్తులు కొనుగోలు చేశామని తెలిపారు. దానికి సంబంధించి తాము కబ్జాలో ఉన్న ప్రకారం రికార్డులు, గూగుల్ మ్యాప్‌లను మార్చాలని కోరారు. ఈ విషయమై ఇది వరకే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు



తాండూరు రూరల్: ఉద్దండపూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న డీటీ



మర్పల్లిలో అధికారులకు దరఖాస్తు అందజేస్తున్న రైతు



దుద్యాల్: కుదురుమల్ల రైతు సదస్సులో రెవెన్యూ అధికారులు



మోమిన్‌పేట: చక్రంపల్లిలో రెవెన్యూ సదస్సు

సీలింగ్ భూమి కబ్జాకు యత్నం

ధారూరు: కోర్టు పరిధిలో ఉన్న సీలింగ్ భూమిని స్వాధీనం చేసుకునేందుకు యత్నించిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. 197/4, 197/5 సర్వేనంబర్లలోని 4.08 ఎకరాల సీలింగ్ భూమిని గ్రామానికి చెందిన పత్తి అమతమ్మ, చాకలి శంకరయ్యలకు 2.04 ఎకరాల చొప్పున ప్రభుత్వం గతంలో పంపిణీ చేసింది. వీరి నుంచి అవుసుపల్లి లక్ష్మి, శెట్టి లలితాదేవి సదరు భూమిని కొనుగోలు చేశారు. ఈ కొనుగోలు చెల్లదంటూ విక్రేతలు తహసీల్దార్ సాజిదాబేగంకు ఫిర్యాదు చేశారు. దీంతో కొనుగోలు చేసిన వారికి నోటీసులు జారీ చేసి స్వాధీనం చేసుకున్నారు. దీంతో బాధితులు హైకోర్టును ఆశ్రయించి రిలీఫ్ ఆర్డర్‌ను పొందారు. సోమవారం సదరు భూమిని దున్ని, అధికారులు పాతిన బోర్డును తొలగించి కబ్జాలోకి వచ్చారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ రెవెన్యూ అధికారులను పంపించి విచారణ చేయించారు. ఈ విషయమై డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్‌ను ప్రశ్నించగా.. లక్ష్మి, లలితాదేవిలు హైకోర్టును ఆశ్రయించి రిలీవ్ ఆర్డర్ పొందారని చెప్పారు. సిబ్బంది వెళ్లి బోర్డును యథాతథంగా పాతినట్లు ఆయన తెలిపారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్టు

19 మంది నిందితులకు రిమాండ్

ఇబ్రహీంపట్నం రూరల్: కోడి పందెం రాయుళ్లను పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. మన్నెగూడ ఎంఎంకుంట సమీపంలో మర్రి యాదిరెడ్డి వ్యవసాయ క్షేత్రానికి సమీపంలో కోడి పందేలు కొనసాగుతున్నాయనే స మాచారంతో పోలీసులు దాడి చేశారు. 19 మందిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రూ.19,540 నగదు, 17 సెల్‌ఫోన్లు, 12 కోళ్లు, 12 కత్తులను స్వాధీనం చేసుకున్నారు.

గుట్టను తవ్వి.. మట్టిని దోచి!



మట్టితవ్వకాలు జరుగుతున్న ప్రదేశంలో టిప్పర్లు

- యథేచ్ఛగా తరలిస్తున్న అక్రమార్కులు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ యంత్రాంగం

బషీరాబాద్: ప్రభుత్వ భూమిలో ఎర్ర మట్టి తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయి. యథేచ్ఛగా అక్రమార్కులు తరలిస్తున్నారు. అయినా రెవెన్యూ యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. బషీరాబాద్ మండలం నీళ్లపల్లి శివారులోని సర్వే నంబర్ 9లో 3 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. ఓ గుత్తేదారు రోడ్డు పనుల కోసమని ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా భారీ యంత్రాలతో మట్టిని తవ్వి, టిప్పర్లలో తరలిస్తున్నాడు. అది, సోమవారం ఈ రెండు రోజుల్లో సుమారు 150 టిప్పర్ల మట్టిని తరలించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలో భారీ గుంత ఏర్పడింది. ఇంత జరుగుతున్నా.. సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారని పేర్కొంటున్నారు. అధికార పార్టీ అండదండలతో గుత్తేదారు మట్టి దోపిడీకి పాల్పడుతున్నాడని తెలిపారు. ఇదే విషయమై తహసీల్దార్ సాహేదాబేగంను వివరణ కోరగా.. మట్టితవ్వకాల విషయం గ్రామస్తుల ద్వారా తెలిసిందని పేర్కొన్నారు. తవ్వకాలు జరిపినట్లు తేలితే సదరు కాంట్రాక్టర్‌పై కేసునమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. పర్మిషన్ లేకుండా మట్టితవ్వకాలు చేపడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఇబ్రహీంపట్నం రూరల్: మహిళపై దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్‌కు చెందిన మహమ్మద్ రేష్మ, షకీల్‌తో కలిసి ఆదివారం ఆటోలో కొంగరకలాన్‌కు వచ్చారు. అక్కడి నుంచి స్నేహితులు ఎం.లక్ష్మి, సంధ్యారాణి, ప్రతిభలతో కలిసి సంధ్యారాణి.. సోదరి ఇంటికి బయల్దేరారు. మార్గమధ్యలో కల్లు తాగాలని, మంచిగా ఎక్కడ దొరుకుతుందోనని డ్రైవర్‌ను అడిగారు. ఇదే సమయంలో మరో వ్యక్తి వీరి ఆటో వద్దకు వచ్చి, ముందుకు వెళితే కల్లు దొరుకుతుందని చెప్పాడు. దీంతో రేష్మ బైక్‌పై వచ్చిన వ్యక్తితో కల్లుకోసం వెళ్లింది. కొంత దూరం వెళ్లాక, ఇక్కడి నుంచి నడిచివెళ్లాలని చెప్పి, కొంత దూరం కలిసి వెళ్లారు. ఎవరూ లేరని నిర్ధారించుకున్న సదరు వ్యక్తి, ఆమె చేయి పట్టుకొని, దురుసుగా ప్రవర్తించాడు. బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో ఆమె గట్టిగా కేకలు వేయడంతో అతడు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

అదుపుతప్పి డీసీఎం బోల్తా

కేశంపేట: అధిక లోడ్‌తో వెళ్తున్న డీసీఎం.. అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటన మండల పరిధి వేములనర్వ గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్దవెళ్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన వడ్లను, ఇప్పలపల్లి గ్రామ శివారులోని రైస్ మిల్లుకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో డీసీఎం మూలమలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మహేందర్ రెడ్డికి స్వల్ప గాయాలు అయ్యాయి. మలుపు ప్రమాదకరంగా ఉండటంతోనే ఈ ఘటన జరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు.



ఘటనా స్థలంలో డీసీఎం

● మట్టి తొలగింపు



మాల్‌లో సాగర్‌రోడ్డుపై నిలిచిన మట్టిని జేసీబీతో తొలగిస్తున్న వెంచర్ యజమాని

నాగార్జునసాగర్– హైదరాబాద్ రహదారిపై మాల్‌లో గుట్టపై చేసిన వెంచర్ నుంచి కొట్టుకొచ్చిన మట్టిని సోమవారం వెంచర్ యజమాని తొలగించాడు. 'వర్షం వస్తే బురద.. ఆరితే దుమ్ము' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి రాజు స్పందించారు. వెంచర్ యజమానితో మాట్లాడి వెంటనే మట్టిని తొలగించాలని సూచించారు. లేదంటే కేసు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. దీంతో సాగర్ రోడ్డుపై చేరిన మట్టిని తొలగించారు. – యాచారం

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబయ్య



మాట్లాడుతున్న బాబయ్య

షాద్‌నగర్‌రూరల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబయ్య సూచించారు. సోమవారం పట్టణంలోని ఏబీ కాంప్లెక్స్‌లో మండల అధ్యక్షుడు పిట్టల సురేష్ అధ్యక్షతన పార్టీ ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాభివృద్ధే ధ్యేయంగా పీఎం మోదీ అనేక సంస్కరణలను తీసుకొస్తున్నారన్నారు. నిరుపేదల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో నాయకులు ఎంకనోళ్ల వెంకటేశ్, ఇస్నాతి శ్రీనివాస్, ప్రశాంత్, గణేష్, నర్సింహ, వినోద్‌కుమార్, కుర్మయ్య పాల్గొన్నారు.

మార్కెట్‌లోనే విక్రయాలు జరగాలి

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మోహన్

శంకర్‌పల్లి: పట్టణం, మండలంలో పండిన పంటలకు సంబంధించి విక్రయాలు మన మార్కెట్‌లోనే జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాశెట్టి మోహన్ అన్నారు. సోమవారం ఆయన అధ్యక్షతన మార్కెట్ కార్యాలయ ఆవరణలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నష్టాల్లో ఉన్న మార్కెట్‌ను లాభాల్లోకి తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పంటలు అమ్ముకునేందుకు మార్కెట్‌కి వచ్చిన రైతుకు ఎక్కడ అసౌకర్యం కలగకుండా, అన్ని రకాలు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, రాయితీలపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో మార్కెట్ సెక్రటరీ ఐశ్వర్యలక్ష్మి, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు పాడి ఆవుల మృతి



పాడి ఆవుల కళేబరాలు

చేవెళ్ల: పశువులపాకలో ఉన్న రెండు ఆవులు ప్రమాదవశాత్తు మృతి చెందాయి. ఈ సంఘటన మండలంలోని అల్లావాడ అనుబంధ గ్రామమైన జాలగూడలో చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. జాలగూడ గ్రామానికి చెందిన రైతు అత్తిలి అంజిరెడ్డికి ఎనిమిది పాడి ఆవులు ఉన్నాయి. వీటి పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటీ మాదిరిగానే ఆదివారం కూడా పశువులకు మధ్యాహ్నం మేత వేసి నీళ్లు తాపి పాకలో కట్టేశాడు. రాత్రి పశువులను చూసేందుకు వెళ్లే సరికి రెండు ఆవులు పాకలో చనిపోయి పడి ఉన్నాయి. ఏదైనా విషపురుగు కాటు వేసి ఉంటుందని అనుమానిస్తున్నారు. దాదాపు రూ.లక్ష వరకు నష్టం జరిగిందని వాపోయాడు.

మరుగు దొడ్లు నిర్మించాలి

కొడంగల్: నియోజకవర్గ కేంద్రం కొడంగల్ ఆర్టీసీ బస్టాండ్‌లో మరుగు దొడ్లు నిర్మించాలని బీజేపీ సీనియర్ నాయకుడు చంద్రప్ప సంస్థ అధికారులను కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ కర్నాటక సరిహద్దులోని కొడంగల్ బస్టాండ్‌లో చాలీచాలని మరుగుదొడ్లతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం రెండు ఉన్నాయని, ప్రయాణికులకు అనుగుణంగా మరిన్ని నిర్మించాలన్నారు. బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు.

భూసార పరీక్షలతో రైతులకు మేలు



రైతులతో శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ ప్రగతికుమారి

చేవెళ్ల: రైతులు తమ పంట పొలాలకు సంబంధించి నేల స్వభావం తెలుసుకునేందుకు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ సీహెచ్ ప్రగతికుమారి, డాక్టర్ జె.రవీందర్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఊరేళ్లలో సోమవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రైతులతో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో వారు మాట్లాడుతూ.. వ్యవసాయంలో రైతులు సరైన సాగు పద్ధతులు పాటిస్తేనే అధిక దిగుబడులు సాధిస్తారన్నారు. పంటల సాగులో మెలకువలపై అవగాహన కల్పించారు. ఎరువులు, రసాయనిక మందుల వాడకాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. పంట మార్పిడితో దిగుబడులు పెరుగుతాయని సూచించారు. విత్తన ఎంపికలో సరైన జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రతిభ, రైతులు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

ఏపీలో అక్రమ అరెస్టులు

- పత్రికా స్వేచ్ఛపై దాడిని ఖండించిన ప్రజాస్వామ్యవాదులు
- వ్యక్తిగత కక్ష సాధింపు చర్యలు తగవని హితవు



నవాబుపేట: ఏపీలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని దళిత రత్న అవార్డు గ్రహీత, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి శివరాజ్ మండిపడ్డారు. సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. వ్యక్తిగత కక్షసాధింపులకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వం వెంటనే తన వైఖరి మార్చుకోవాలని హితవు పలికారు. పత్రిక స్వేచ్ఛను అడ్డుకోవాలని చూస్తున్న రెడ్ బుక్ రాజ్యాంగాన్ని ప్రతిఒక్కరూ అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాల తప్పులను ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా అని ఆగ్రహం వ్యక్తంచేశారు.

అరెస్టు అప్రజాస్వామికం



పరిగి: సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టు అప్రజాస్వామికమని సీపీఎం నేత, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.వెంకటయ్య అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ తీరును ఖండించారు. ఏపీలో ప్రజాస్వామ్య వ్యవస్థలు ఇబ్బంది పడుతున్నాయని తెలిపారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతులను నొక్కే ప్రయత్నం జరుగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో జరిగిన మోసాలు, అవినీతి, వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకే ఇలాంటి చవకబారు కుయుక్తులు పన్నుతోందని ఎద్దేవా చేశారు.

పత్రికా స్వేచ్ఛను హరించడమే..



అనంతగిరి: ఏపీలో కొనసాగుతున్న అక్రమ అరెస్టులపై టీయూడబ్ల్యూజే 143 జిల్లా ఉపాధ్యక్షుడు నర్సయ్య తీవ్రంగా స్పందించారు. ఆంధ్రప్రదేశ్‌లో జర్నలిస్టులను అక్రమంగా అరెస్టు చేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనని మండిపడ్డారు. సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్ట్ చేయడంలో కూటమి ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేని ఏపీ ప్రభుత్వం, వాటిని ఎత్తి చూపుతున్నారనే కారణంతో అక్రమంగా అరెస్టు చేస్తున్నారని మండిపడ్డారు. కేఎస్ఆర్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.